# ఏడుపాయలు

అపర్ణ మునుకుట్ల గునుపూడి






ఓరి పోలమ్మో! లగెత్తుకురాయే! బండెలిపోద్ది." వీరయ్య కేకేసేడు.

"వత్తన్నా, మావా, చంటాడేడుస్తూంటే పాలు తాపి వద్దామని" అంటూ అరుస్తోందిగాని కనిపించడం లేదు పోలమ్మ. వీరయ్యకి బస్సందదేమోనని భయం. ఇంకా గుడిసెలో ఏం చేస్తోందో అర్థం కావడం లేదు. వీరయ్య పెళ్ళాం పోలమ్మ. వాళ్ళకి అయిదేళ్ళ కూతురు రంగి, ఓ రెండేళ్ళవాడు కొడుకు రాముడు ఉన్నారు. వాడే చంటిగాడు. వీరయ్య ఇళ్ళు కట్టడానికి పనులు చేసే మేస్త్రి. పోలమ్మ ఇళ్ళల్లో పనులు కుదుర్చుకుని చేసుకుంటుంది. వాళ్ళ సంసారం లోతు పాతులే వో వాళ్ళు చూసుకుని ఉన్నంతలో సరదాగా గడుపుకొస్తున్నారు. వీరయ్య అందరిలానే తాగడం అదీ చేస్తాడుకాని, పెళ్ళాం అంటే మాత్రం మహా ముద్దు. ఎన్నడూ పోలి మీద చెయ్యి చేసుకోడు. అతిగా కష్ట పడనివ్వడు. ఏటికొకసారైనా అమ్మవారి పేరు చెప్పి ఏడుపాయలకివెళ్ళడం వాళ్ళకి అలవాటు. అక్కడ నదీ సంద్రాల సంగమం. అక్కడ అమ్మవారి పేరు ఏడుపాయలతల్లి. ఈ ప్రాంతంలోని కూలీ నాలీ జనం అంతా తప్పకుండా వెళ్ళి తీరుతారు. అక్కడ సముద్రంలో స్నానాలు చేసి, ఆ తల్లిని కొలిచి తమని చల్లగా చూడమని వేడుకుంటారు. అందుకే ఈ ప్రయాణం. వీళ్ళున్న ఊరినుంచి ఏడుపాయలు బోలెడు దూరం. బస్సులో వెళ్ళాలి. చుట్టుపక్కల ఉన్న వాళ్ళందరూ కలిసి వెళ్ళేట్టుగా మాట్లాడుకున్నారు. వండుకోవడానికి గిన్నెలూ, తప్పేలాలూ, వంటసామగ్రి అన్నీ తీసుకుని మరీ బయలుదేరేరు. వీళ్ళకి డబ్బులు గొప్పగా లేకపోయినా ఉన్నదాంట్లో సర్దుకుని ఈ ఏడుపాయల యాత్ర చేస్తారు.

Computer ముందు కూచుని కూచుని విసుగేసింది సుజాతకి. కుడి చెయ్యి మండ దగ్గర తెగ లాగేస్తోంది. ఇంకా బోలెడు పని ఉంది కాని ఇంకేమాత్రం చేసినా చెయ్యి ఊడిపడిపోతుందేమోనన్నంత నొప్పెడుతోంది. ఈ చెయ్యి నొప్పితో ఇప్పటికి బోలెడుమార్లు డాక్టరు దగ్గరికి వెళ్ళడం జరిగింది. కాని ఏం ప్రయోజనం లేక పోయింది. వాళ్ళెన్ని మందులిచ్చినా ఉపయోగం లేదు. ఇంత నొప్పితో exercises ఎమీ చెయ్యడానికి లేదు. మార్గాంతరం తోచడం లేదు. క్రితం మాటు వెళ్ళినప్పుడు పది రోజుల్లో ఇచ్చిన మందులతో తగ్గకపోతే మళ్ళీ రమ్మన్నాడు. అదే చేసింది. వెళ్ళి ఇంకా తగ్గలేదని, ఏదో ఒకటి చెయ్యకపోతే తను చెయ్యి లేకుండా అవిటిదైపోతానేమోనన్న భయాన్ని వ్యక్తం చేసింది. డాక్టరు నవ్వి, "అంత ప్రమాదం రాదులే దీన్ని carpel tunnel syndrome అంటారు. ఎక్కువసేపు చేతి వేళ్ళని ఒకేలాగ కదిలిస్తూ

పనిచేస్తే వస్తుంది. చేతికి splint ఇస్తాను. అది వేసుకుని బాగా rest తిసుకుంటే తగ్గుతుంది" అని చేతికి ఒక తొడుగులాంటిది ఇచ్చి, చేతనయినంతవరకూ అది వేసుకుని పనులు చెయ్యమన్నాడు. పని చేసే తీరు కూడా మార్చుకోమన్నాడు. ఎడం చెయ్యి కూడా ఉపయోగించడానికి ప్రయత్నం చెయ్యమన్నాడు. సరేనని ఆ తొడుగు తీసుకుని వచ్చింది. అదీ చూద్దాం కొన్ని రోజులు అనుకుంది. అది వేసుకోవడంవరకూ బాగానే ఉంది కాని rest ఎలా తీసుకోవడం? రోజూ ఉద్యోగం ఇంటిపనులూ తప్పవు. వారం, రెండు, మూడు వారాలూ గడిచినా నొప్పి తగ్గే సూచనలు కనిపించడంలేదు. చివరికి విసుగొచ్చి శలవు పెట్టి

ఇంటికి వెళదాం అని నిర్ణయించింది సుజాత. office లో రెండు నెలలు శలవు అడిగింది. రెండు నెలలు చాలా ఎక్కువ, ఓ నెల ఇస్తాం అన్నారు. మధ్యస్థంగా ఆరువారాలకి ఒప్పుకుని, India ప్రయాణం పెట్టుకుంది సుజాత.

Airportలో అమ్మని, నాన్నగారిని చూసేప్పుడికి తాత్కాలికంగా అన్ని నొప్పులూ తగ్గిపోయేయనిపించింది.

" Welcome, welcome రా తల్లి. ప్రయాణం బాగా జరిగిందా? ఏమిటిలా చిక్కిపోయేవు?" తల్లి అంటూంటే భోరని ఏడవాలనిపించినా తమాయించుకుని "ఆc బాగానే జరిగిందమ్మా. మీ ఆరోగ్యం ఎలా ఉంది?" అన్న పలకరింపులతో కారు దగ్గరికి వచ్చేరు. నాన్నగారు ఎంత వయస్సయినా ఆయనే కారు drive చేసుకుంటారు. ఎన్నడూ driver ని పెట్టుకోరు. సామాను లోపల పెట్టి కారులో కూచుని ఇంటికి బయలుదేరేరు. ఇంటి దగ్గరకి చేరగానే ఎక్కడలేని ఆనందం వేసింది సుజాతకి. ఇంటి బయటే పనిమనిషి పోలమ్మ ఎదురు చూస్తూ ఉంది. పోలమ్మ పేరుకి పనిమనిషే అయినా ఇంటిమనిషంటేనే బాగుంటుందేమో. కారు చూడగానే లేచి నిల్చుని "రండమ్మాయిగోరూ" అంటూచేతిలో సామాను అందుకుంది. హాయిగా bag దాని చేతికి ఇచ్చేసింది. అమ్మ ముందే చెప్పిందిట. మేం వచ్చేప్పుడికి పనులు చేసి పెట్టడానికి ఇంటికి రమ్మని. అందుకే పోలమ్మ మళ్ళీ వచ్చింది.

"స్నానం చేస్తారా, అమ్మాయిగోరూ? ఏన్నీళ్ళు పెట్టేనాండీ?"

"ఆ పెట్టు పోలమ్మా, వేడినీళ్ళు తయారయ్యేప్పుడికి నేను బట్టలూ అవీ తీసుకుంటాను. స్నానం చేసే కూచోవచ్చును" అంది సుజాత. పోలమ్మ నీళ్ళు పెట్టడానికి వెళ్ళి పోయింది. అమ్మా, నాన్నతో కాసేపు కబుర్లు చెప్పి బట్టలు తీసుకుంటానంటూ లేచింది. ఈ లోపల నీళ్ళు తయారుగా ఉన్నయంటూ వచ్చింది పోలమ్మ.

"ఇదిగో నేను బట్టలు తీసుకుని వచ్చేస్తున్నాను."

"ఏనాడు బయలుదేరినారో ఏమో, మీ వొళ్ళంతా పచ్చి పుండయ్యుంటది, మీ వొంటికి నూని రాసి రుద్దుతాను రండమ్మగారు" అంది పోలమ్మ.

"అబ్బే, వద్దులేవే, ఇవాళకి నేను స్నానం చేసేస్తాను. మరో రోజు చూద్దాంలే!"

"అలా కుదర్దులెండి. ఇవాళ నేను రుద్దాల్సిందే, మీరు రుద్దించుకోవాల్సిందే " అంటూ బలవంతం చేసింది. తను వళ్ళు మర్ధన చెయ్యందే స్నానం చెయ్యడానికి వీల్లేదంటూ మంకు పట్టు పట్టింది. చేసేదిలేక సరేనంది. వొంటికి నూనె రాసి మర్ధన చేస్తూంటే మాత్రం ఎంత శవానుగా ఉందో అనిపించింది. ముందు కాస్త అక్కరలేదంటూనే తర్వాత ఆ massage కి అలవాటుపడిపోయి హాయిగా చేయించుకుంది.

"ఎక్కడ నేర్చుకున్నావే పోలీ నువ్వు, ఇంత బాగా మర్ధన చేస్తున్నావు. మా ఊళ్ళో ఎంత డబ్బిచ్చినా ఇంత బాగా massage చెయ్యరు." అనడిగింది.

"అయ్యో! ఇదేం బ్రెమ్మ విద్యా అమ్మాయిగోరూ. మేం మా చంటిగాళ్ళకి రోజూ ఇలగ మర్ధన చేసి నీళ్ళు పోస్తం. వాళ్ళు చక్కగ నిద్దరోతరు." చంటాళ్ళ సంగతి దేవుcడెరుగు, సుజాతకి ఇప్పుడే నిద్దరొచ్చేట్టుంది. స్నానం ముగించేప్పుడికి వేడి వేడిగా అమ్మ భోజనం తయారు. భోజనం చేసిందే తడవు, పోలమ్మ చెప్పినట్టు కంటి నిండా మత్తు కమ్మినట్టు నిద్దరొచ్చేసింది. తమరు అలగ చెయ్యి కడిగేసుకుని నెగండమ్మాయిగోరూ, నేను అన్నీ తీసేసి సర్దుతాను" అంటూన్న మాటలు సరిగా వినిపించనేలేదు, సుజాతకి. అలాగే కంచంలో చెయ్యి కడుక్కుని, సోఫా వరకూ ఎలాగో వచ్చి అక్కడే వాలిపోయింది, నిద్దరలోకి. అలా ఎంత సేపు పడుక్కుందో తెలీదు కాని తెలివొచ్చేప్పుడికి కాస్త చీకటి పడుతూ సాయంత్రం అయిందని తెలుస్తోంది. సుజాత కదలడం చూసి

"తెలివొచ్చిందా! కాస్త టీ పెట్టనా?" అంది అమ్మ.

"ఆc అలాగేనమ్మా, కొంచం మొహం కడుక్కుని వస్తానుండు " అంటూ లేచింది. Office పనులూ, ఇంటి గొడవలూ ఏం లేకుండా, ఆప్యాయంగా చేసిపెట్టేవాళ్ళ మధ్యన ఉంటే, ఒహ్!

ఇది గదా rest అంటే అనుకుంది. టీ తాగుతూ తన చెయ్యి నొప్పి, పనులూ, rest తీసుకోమనడం గురించి చెప్పింది.

"ఈ డాక్టర్లు, మందులూ ఏమీ పని చెయ్యడం లేదే తల్లీ, మాట్లాడితే అవసరం ఉన్నా లేకపోయినా బోలెడు tests చేసేస్తారు. మనకి ఎందుకో ఏమిటో తెలియక వాళ్ళు చెప్పినవన్నీ చేయిస్తాం. చివరికి మనకి నొప్పులు మిగులుతాయి, వాళ్ళకి డబ్బులు చేరుతాయి. ఈ డాక్టర్ల పని పూర్తిగా వ్యాపారం అయిపోయిందమ్మా. అది సరేగానీ ఈ మధ్య కొత్తగా రకరకాల treatments తో healing చేస్తున్నారుట. అందరూ అవి చాలా బాగా పని చేస్తున్నాయంటున్నారు. అవి ఏవైనా ప్రయత్నం చేస్తావా?"

"ఏం చేస్తారు, వాళ్ళు?"

"ఏమో నేనెప్పుడూ వెళ్ళలేదు. కనుక్కోమంటే నా స్నేహితురాలు రాజ్యలక్ష్మిని అడుగుతాను"

"సరే కనుక్కో, అదీ చూద్దాం"

అమ్మ ఆవిడకి phone చేసి కనుక్కొని, రేపు మధ్యాహ్నంగా తను తీసుకెళతానందే, ఇది Pranic healing ట. దీంట్లో tests అవీ ఏం ఉండవుట. నొప్పెక్కడో చెబితే చాలు" అంటూ చెప్పింది. అలాగేనన్నాది.

మర్నాడు రాజ్యలక్ష్మి ఆంటీతో కలిసి Pranic healing center కి వెళ్ళింది. అక్కడ మందులూ, మాకులూ, test లూ ఏవీ లేవు. కొంచెం నడివయస్సుకంటే పెద్దగా ఉన్న ఒకాయన్ని healer గా పరిచయం చేసేరు ఆంటీ. ఆయన వివరాలన్నీ కనుక్కుని నొప్పి ఎన్నాళ్ళుగా ఉంది ఎక్కడ నొప్పి అనడిగేరు.. వివరంగా అన్నీ చెప్పింది . ఆయన లోపలికి తీసుకెళ్ళి ఎత్తుగా ఉన్న ఓ bed మీద పడుక్కోమన్నారు. అక్కడ ఓ పెద్ద bowl లో నీళ్ళున్నాయి. ఎందుకో అర్థం కాలేదు కాని, తను చెయ్యాల్సిందేం లేదు కనక కళ్ళు మూసుకు పడుక్కున్నాది. ఆయన ఏవో చదువుతున్నట్టుగా ఉన్నారు. ఓ అరగంట దాకా జరిగింది ఈ తతంగం. అయ్యేక లేవమన్నారు. రెండువారాలపాటు రోజూ చేయించుకుంటే తగ్గిపోతుందని చెప్పి, ఇంటికి వెళ్ళేక ఒళ్ళంతా ఉప్పుతో రాసుకుని, బాల్చీడు నీళ్ళల్లో ఇంత ఉప్పు కలిపి, ఆ ఉప్పు నీటితో ముందు స్నానం చేసి తర్వాత మంచినీటితో స్నానం చెయ్యమన్నారు. ఎందుకు, ఏమిటీ అని అడక్కుండా బయటికి వచ్చేసింది. రాజ్యలక్ష్మి ఆంటీ fees గురించి అడిగింది. ఒక session కి రు. 200.00 అన్నారు. Fees ఇచ్చేసి బయలుదేరి వచ్చేసేం. ఇంట్లో అమ్మ గారాబం, పోలమ్మ సేవలు, healing treatment లతో హాయిగా ఉంది. ఇలా ఉంటే నొప్పులు తగ్గక ఏం చేస్తాయనుకుంటూన్నంతలో "భోగి భోగి నీ భోగం ఎన్నాళ్ళే? అంటే ఎల్లుండి పొద్దున్న అత్తొచ్చేదాకా"అన్నట్టు ఓ నాలుగు రోజులనాడు పోలమ్మ రాలేదు. ఎందుకు రాలేదని అడిగితే

"అది ఏడుపాయలకి వెళ్ళిందే" అంది అమ్మ.

"ఏడుపాయలేవిటమ్మా?"

"అదా! అదొక ఊరే. అక్కడ ఏదో నది సముద్రంలో కలుస్తుంది. అక్కడ అమ్మవారికి చిన్న గుడి ఉంది. వీళ్ళు ఏడాదికొకమారైనా తప్పకుండా అక్కడికి వెళ్ళి సముద్ర స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకుని వస్తారు. ఈ కూలీ నాలీ జనం ఇంకేం చేసినా చెయ్యకపోయినా ఈ యాత్ర మాత్రం తప్పక చేసి తీరతారు. ఆట్టే రోజులుండదు, రెండు రోజుల్లో వచ్చేస్తుందిలే" అంది.

తల్లి చెప్పిన మాట విని అదిరిపోయింది సుజాత. తలపట్టుకుని "అయ్యో, అమ్మా! పనీ పాటా చేసుకునే వాళ్ళకి ఉన్న పాటి జ్ఞానం మనకి లేదమ్మా!" అంటూ వాపోయింది.

"ఏమిటే అంటున్నావు" ఆశ్చర్యంగా అంది తల్లి. "అమ్మా! చిన్నప్పుడు తాతగారితో గ్రహణాలప్పుడూ, కొన్ని పండుగలప్పుడూ సముద్రస్నానాలకి వెళ్ళేవాళ్ళం, గుర్తుందా?"

"అవునూ, అదెందుకిప్పుడు"

"అమ్మా! నువ్వు సముద్ర స్నానానికి వెళ్ళి ఎన్నేళ్ళయ్యింది చెప్పు"

"చాలా ఏళ్ళుగా మానేసేం. నాన్నగారికి అలాంటివేవీ నచ్చవు. పైగా గ్రహణానికి సముద్ర స్నానాలకి ఏమిటి సంబంధం, నీ

పిచ్చిగానీ అని వేళాకోళం. నేనూ బలవంతం చెయ్యడం మానేసాను. అయినా ఇప్పుడవన్నీ ఎందుకే?"

"చెబుతా విను. నేను రోజూ రూ. 200.00 ఇచ్చి ఏం చేస్తున్నాననుకుంటున్నావు?"

"ఆయనేదో treatment చేస్తున్నారుగా!"

"ఏ treatment లేదు. ఇంటికొచ్చి బాల్చీడు ఉప్పునీళ్ళతో స్నానం చెయ్యమని చెప్పి పంపిస్తున్నారు. ఉప్పునీటి స్నానంలో ఏదో ఉందన్నమాట. అందుకే సముద్రస్నానాల ఆచారం వచ్చి ఉంటుంది. ఆచారాలు అధిగమించడానికేనన్నట్టు మనం వాటిని మానేసేం. అటు పాశ్చాత్తులలాగా bikinies వేసుకుని beaches లో మునగడాలూ చెయ్యం, ఇటు మన ఆచారాలూ పాటించం. మనం రెంటికీ చెడ్డ రేవడులయ్యేం, అమ్మా!

